క్లుప్తంగా

28న జానమద్దిపై స్మారకోపన్యాసం

కడప కల్చరల్: ఈ నెల 28వ తేదీన సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి 10వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయనపై స్మారక ఉపన్యాసం ఏర్పాటు చేశామని బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య టీ రామప్రసాదరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య అతిథిగా వైవీయూ ఉప కులపతి ఆచార్య చింతా సుధాకర్ హాజరవుతారన్నారు. ప్రముఖ అవధాన కవి డాక్టర్ నరాల రామారెడ్డి ప్రధాన వక్తగా పాల్గొని అవధాన వైభవం అనే అంశం పై ప్రసంగిస్తారన్నారు.

నేడు ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

కడప రూరల్: వేంపల్లెలోని బీవీ సుబ్బారెడ్డి మెడికల్ స్టోర్‌లో బుధవారం ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాతృశ్రీ ఐవీఎఫ్ క్లినిక్ స్పెషలిస్టు వైద్యులు వై.ప్రమోద తెలిపారు. మంగళవారం స్థానిక ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని వేంపల్లె మండల పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంతానలేమితో బాధపడుతున్న దంపతులు ఈ వైద్య శిబిరంలో లభించే వైద్య సేవలు, సూచనలు, సలహాలు పొందాలని సూచించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి హాజరయ్యే వారు సెల్ నెంబరు 79956 29110లో సంప్రదించాలన్నారు.

రేపు 'ఉయ్యాలవాడ' వర్ధంతి సభ

కడప కల్చరల్: తొలి స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177వ వర్ధంతి సభను గురువారం ఉదయం 10 గంటలకు డాక్టర్ వైఎస్సార్ స్మారక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్లు రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు తెలిపారు. కార్యక్రమానికి కడప మున్సిపాలిటీ మాజీ చైర్మన్ హరీంద్రనాథ్, రాయలసీమ కార్మిక కర్షక సమితి అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి, రాయలసీమ కమ్యూనిటీ పార్టీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, విద్యావేత్త బైరెడ్డి రామకృష్ణారెడ్డిలు అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డిపై వక్తృత్వ పోటీ నిర్వహించనున్నామని, విజేతలకు గురువారం జరగనున్న సభలో బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు.

మొల్ల జయంతి నిర్వహణకు వినతి

వైవీయూ: కవయిత్రి మొల్లమాంబ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా యోగివేమన విశ్వవిద్యాలయంలో మొల్ల జయంతిని నిర్వహించాలని మొల్ల సాహితీపీఠం అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు కోరారు. మంగళవారం వైవీయూలో వీసీ ఆచార్య చింతా సుధాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మార్చి 7 నుంచి 12వ తేదీలోపు జయంతి వేడుకలు విశ్వవిద్యాలయంలో నిర్వహించాలని కోరారు.

పుస్తకం ఆవిష్కరణ

కడప రూరల్: జిల్లా కలెక్టర్ విజయరామరాజు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రాయల్ రషీద్ జీవిత చరిత్ర పుస్తకంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయల్ రషీద్ ఫ్రీలాన్స్ ఫోటో గ్రాఫర్‌గా విశేష సేవలను అందించారని అన్నారు. ఆయన తనయుడు షబ్బీర్ తన తండ్రి ఆశయ సాధన కోసం కృషి చేయడం, జీవిత చరిత్ర పుస్తకంను రూపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాయల్ రషీద్ తనయుడు షబ్బీర్ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం


షేక్ జహీర్ (ఫైల్)

కడప అర్బన్: కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో చెమ్మామియాపేటలో పవన్ స్కూల్‌లో 8వ తరగతి చదువుకుంటూ, హాస్టల్‌లో వుంటున్న షేక్ జహీర్ (14) ఈనెల 18 వ తేదీ హాస్టల్ నుంచి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడని ఆ విద్యార్థి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 91820 84450 , 63029 72143కు సమాచారం ఇవ్వాలని విద్యార్థి తల్లిదండ్రులు తెలియజేశారు. ఈ సంఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

ఇద్దరు మట్కా బీటర్లు అరెస్ట్


అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న కడప చిన్నచౌక్ సీఐ నరసింహా రెడ్డి

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం ఉక్కాయపల్లి డంపింగ్‌యార్డ్ సమీపంలో ఇద్దరు మట్కా రాస్తుండగా సీఐ నరసింహారెడ్డి, ఎస్ఐ రవికుమార్‌లు తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 32,520 నగదుతో పాటు, రెండు మట్కా స్లిప్‌లు, రెండు బాల్‌పెన్నులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో షేక్ మున్నా, షేక్ మహబూబ్ బాషా వున్నారు.

సామాజిక న్యాయం అందుబాటులోకి రావాలి

జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్



మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్


పాల్గొన్న స్థానిక ప్రజలు

కడప అర్బన్: సమాజంలో పేదరికం లేకుండా చేయడానికి, లింగం, శారీరక వివక్ష, నిరక్షరాస్యత, మతపరమైన వివక్షను తొలగించడానికి సామాజిక న్యాయం రావాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ అన్నారు. కడప నగర శివార్లలోని సరోజినీ నగర్ ఎస్టీ కాలనీలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 'ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం' సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సామాజిక న్యాయం అందుబాటులోకి రావాలన్నారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 20వ తేదీన ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం పాటిస్తున్నామన్నారు. సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారిని సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి హెచ్. వెంకటసుబ్బయ్య, భూగర్భ జల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. కరీముల్లా బాష, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె. మునిస్వామి, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ యోగయ్య రాయల్, మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ఇన్‌ఛార్జ్ హెడ్మాస్టర్ లక్ష్మీనారాయణ, పారా లీగల్ వాలంటరీ జె. సురేష్ సహాయం, సరోజినీ నగర్ గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి


పారిశుధ్య కార్మికురాలితో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలో రహదారుల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన అంబేడ్కర్ సర్కిల్- వై జంక్షన్, అన్నమయ్య జంక్షన్-గోకుల్ సర్కిల్, క్రిష్ణదేవరాయ సర్కిల్-దేవునికడప రోడ్లను పరిశీలించారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి వై జంక్షన్ వరకూ డివైడర్‌లో గ్రిల్ ఏర్పాటు చేయాలని, ఫుట్‌పాత్‌కు పెయింటింగ్ వేయించాలన్నారు. పనులు తక్షణం పూర్తి చేసి ప్రజలకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. అన్నమయ్య జంక్షన్ వద్ద డ్రైనేజీపై స్లాబ్ వేయించాలన్నారు. విద్యుత్ స్తంభాలను మార్చు చేయాలన్నారు. కూడలి వద్ద ప్లాంటేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. అన్నమయ్య సర్కిల్ నుంచి క్రిష్ణా సర్కిల్ మధ్యలో ఆక్రమణలను తొలగించాలన్నారు. పొట్టి శ్రీరాములు జంక్షన్‌లో ప్లాంటేషన్ వెంటనే చేపట్టాల్సిందిగా హార్టికల్చర్ విభాగ అధికారులకు ఆదేశించారు. దేవుని కడప రోడ్డు నిర్మాణ పనులలో అప్రోచ్ రోడ్లను ఏర్పాటు చేయాలని, వాటి కోసం స్లాబ్‌లను కట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీప్లానర్ నాగేంద్ర, ఆర్అండ్‌బీ, నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

శనగ బేడలు, గోధుమ పిండి అందజేత


వినియోగదారుడికి గోధుమపిండి ప్యాకెట్‌ను అందచేస్తున్న దండు గోపి

కడప అగ్రికల్చర్: కడప నగరంలోని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) కార్యాలయంలో నగర ప్రజలకు తక్కువ ధరలో భారత్‌దాల్ (శనగ బేడలు), గోధుమ పిండిని అందించే కార్యక్రమాన్ని మంగళవారం డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తక్కువ ధరలో శనగబేడలు, గోధుమ పిండి అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీంతో పేద ప్రజలకు ఎంతో మేలు జరగుతుందన్నారు. డీసీఎంఎస్ మేనేజర్ ఖాదర్‌బాష మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నుంచి కడప పట్టణ ప్రజలు తమ ఆధార్‌కార్డుతో కడప నాగరాజుపేటలోని డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లోని కార్యాలయానికి వచ్చి ఈ రెండు సరుకులు తీసుకపోవచ్చని అన్నారు. ఒక ఆధార్ కార్డుకు ఒక కిలో శనగ బేడలు, 5 కిలోల భారత్ ఆట (గోధుమ పిండి) ఇస్తామన్నారు. ఇందులో కిలో గోధుమ పిండి రూ. 27.50, కేజీ శనగ బేడలు కిలో రూ. 60 చొప్పున అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ అసిస్టెంట్ మేనేజర్ రఘురామిరెడ్డి, అకౌంటెంట్ నారాయణరెడ్డి, సిబ్బంది తిరుపాల్ రెడ్డి, కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ సబ్ డివిజన్ ఆఫీసర్ సత్యానంద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుభాస్‌చంద్ర బోస్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి


సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థినులతో అతిథులు

వైవీయూ: విద్యార్థులు రెగ్యులర్ కోర్సులతో పాటు ప్రభుత్వం అవకాశం కల్పించిన సర్టిఫికెట్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సు ముగింపు, సర్టిఫికెట్‌ల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నవంబర్‌లో ప్రారంభమైన ఈ కోర్సు నాలుగు నెలలపాటు పుట్టగొడుగుల పెంపకంపై నిర్వహించడం అభినందనీయమన్నారు. గౌరవ అతిథులుగా విచ్చేసిన కెనరా బ్యాంక్ మేనేజర్ ఎం. శ్రీకాంత్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు ముద్ర ద్వారా లోన్ అప్లై చేసుకోవచ్చన్నారు. వీరికి రూ.20 లక్షల వరకు లోన్ సౌకర్యం ఉందని, సబ్సిడీ కూడా ఇస్తామని పేర్కొన్నారు. అనంతరం శిక్షణ పొందిన 106 మంది బీజెడ్‌సీ, బీఏ, బీకాం విద్యార్థినులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి డా. పి. సుబ్రమణ్యం, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు ఎస్. రాజశేఖరరెడ్డి, అనురాధ, నాగరత్నమ్మ, శాలెం తదితరులు పాల్గొన్నారు.

పంచ సూత్రాలు పాటిస్తే ప్రమాదాల నివారణ


మాట్లాడుతున్న డీపీటీఓ పి.గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్ : పంచ సూత్రాలు పాటించి డ్రైవింగ్ చేస్తే కెఎంపీఎల్ పెరగడంతోపాటు ప్రమాదాలను నివారించవచ్చునని డీపీటీఓ పి.గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని డీపీటీఓ కార్యాలయంలో ప్యాసింజర్స్ కంప్లైంట్స్, బీహేవియర్ ఆఫ్ క్రూయాక్సిడెంట్ ప్రాన్ డ్రైవర్స్‌ను , అత్యల్ప ఇంధన పొదుపు డ్రైవర్లకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు మనసు ప్రశాంత వాతావరణం కోసం ఓంశాంతి శ్రీప్రదీపా అక్కయ్య వారిచే యోగా, ధ్యానం చేయించారు. అనంతరం డీపీటీఓ పి.గోపాల్‌రెడ్డి డ్రైవర్లకు, కండక్టర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి, కడప సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ రామయ్యలు డ్రైవర్లను బస్సుపై తీసుకెళ్లి రహదారి సిగ్నల్స్ గురించి వివరించారు. ఇంధన పొదుపు చేయడంతోపాటు ప్రమాదాలు నివారించడం డ్రైవర్ల ద్వారా చూపించారు.

ఆర్టీసీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం

కడప కోటిరెడ్డి సర్కిల్: ఆర్టీసీ డిపోలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణీకులు పలు సమస్యలను ఆర్ఎంకు విన్నవించారు. జమ్మలమడుగు నుంచి చాగలమర్రికి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. కడప నుండి పామూరుకు బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని.. అయితే బస్సు సమయ వేళలు ప్రయాణీకులకు అనువుగా లేవన్నారు. బద్వేలు నుండి విజయవాడకు నూతనంగా బస్సు సౌకర్యం కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ.. పామూరులో బస్సు సమయం ఉదయం 11గంటలకు పెట్టాలని ఆర్ఎం గోపాల్‌రెడ్డిని పలువురు ప్రయాణీకులు కోరారు. వీటినన్నింటిపై త్వరలో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

బంజారాల గర్జన సభను విజయవంతం చేయాలి


సంఘీభావం తెలుపుతున్న బంజారా సేవా సంఘం నాయకులు

కడప కార్పొరేషన్: అనంతపురం జిల్లా కదిరి జిల్లా పరిషత్ స్కూల్ ఆవరణంలో ఈనెల 25వ తేది జరిగే బంజారాల గర్జన సభను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి డా. శివానాయక్, జిల్లా అధ్యక్షులు రమావత్ జగన్ రాథోడ్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం తమ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ గర్జన సభలో బంజారాలకు సంబంధించిన రాజకీయ, విద్య, వైద్యం, ఉద్యోగ, ప్రజా సమస్యలపై చర్చించి ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. బంజారాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని తాండాల నుంచి బంజారాలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు వెంకటస్వామి నాయక్, జిల్లా యువజన నాయకులు కృష్ణ నాయక్, బీడీ నాయక్, గోపి నాయక్, రాజా నాయక్, విష్ణు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుంది


మాట్లాడుతున్న స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్

వైవీయూ: దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుందని చెప్పిన కొఠారి సూక్తి అక్షర సత్యమని స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ పేర్కొన్నారు. మంగళవారం కడప నగరం పాతకడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టెప్ ఆధ్వర్యంలో 'వ్యక్తిత్వ వికాస' అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఆధునిక విద్యావిధానం మానవులను సమాజానికి అనుగుణంగా తీర్చిదిద్దడానికి అవసరమైన శిక్షణ ఇస్తుందన్నారు. వ్యక్తిత్వ వికాసంలోను, సామాజిక అభివృద్ధిలో విద్యపాత్ర ఎంతో కీలకమన్నారు. ఏపీఎస్‌డబ్లుఆర్ విశ్రాంత ప్రిన్సిపాల్ థామస్‌రెడ్డి వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విశ్వభారతి, ఉపాధ్యాయులు ఆర్. నాగరాజు, కె.విశ్వప్రసాద్‌రెడ్డి, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు భాష పరిమళించిన నేల మనది


తొలి తెలుగు శాసనం వద్ద డాక్టర్ తవ్వా వెంకటయ్య తదితరులు

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లాలో తెలుగు భాష ఔన్నత్యం గొప్పగా పరిమళించిందని రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంను పురస్కరించుకొని ఆయన మంగళవారం కలమల్లలోని తొలి తెలుగు శాసనాన్ని పరిశీలించారు. చూడడానికి రాతి శకలమే అయినా తెలుగు భాషా ఘనతను చాటి చెపుతున్న ఈ శాసనం మన జిల్లా పాలిట అద్భుతమైన వారసత్వ సంపదగా భావిస్తామని ఆయన పేర్కొన్నారు. రెండవ శాసనం కూడా మన జిల్లాలోనే లభించడం అదృష్టమన్నారు. వీటిని రాష్ట్ర అధికార భాషా సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిరక్షించేందుకు కృషి చేస్తామన్నారు. అపురూప వారసత్వ సంపద అయిన శాసనాలు, తాళపత్రాలపై త్వరలో యోగి వేమన విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సును నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, భాషాభిమానులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కమలాపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముమ్మడిసిద్దుపల్లె గ్రామ పంచాయతీలోని జగంరెడ్డిపల్లెలో రూ.46 లక్షలు ఎస్‌డీఏఫ్ నిధులతో చేపడుతున్న సీసీరోడ్లు, డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో డ్రైనేజీ, సీసీరోడ్లు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. జగంరెడ్డిపల్లెలోని అన్ని వీధుల్లో డ్రైనేజీ, సీసీ రోడ్లు ఏర్పాటు చేసి మోడల్ గ్రామంగా తయారు చేస్తామన్నారు. పనులు కూడా నాణ్యతగా చేపట్టాలని సూచించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్న వెంకటసుబ్బారెడ్డి కుమారై నూతన వధువరులైన ప్రత్యూష, రామాంజనేయరెడ్డిల రిసెప్షన్‌కు హాజరైయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, ఎస్సార్‌సీపీ నాయకులు ఖాదర్ పాల్గొన్నారు.

● రాహుకాల పూజలు



కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ఈ పూజలు నిర్వహిస్తే రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణిభూషణశర్మ భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. -కడప కల్చరల్

ఓటు శక్తివంతమైన ఆయుధం


ర్యాలీ నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

కమలాపురం: ప్రజాస్వామ్యంలో శక్తి వంతమైన ఆయుధం ఓటు అని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు మదర్ థెరిసా సేవాసమితి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అనేది శక్తివంతమైన ఆయుధం అన్నారు. మన ప్రాంతాలను అభివృద్ధి పరచుకోవాలంటే ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకుని మంచి పాలకుడిని ఎన్నుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రాముడు, మదర్ థెరిసా సేవాసమితి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్ మాట్లాడుతూ ఒకే ఒక్క ఓటుతో ప్రధాన మంత్రి పదవి కోల్పోయినవారు ఉన్నారని, అలాగే ఒక్క ఓటుతో అధికారం చేపట్టిన వారు ఉన్నారని, యువత మేల్కోవాలని వారు పిలుపునిచ్చారు.

పులివెందుల టౌన్: ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాల ని ఆర్డీఓ వెంకటేశులు తెలిపారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యతపై ర్యాలీ నిర్వహించారు.

వేతనాల పెంపుపై హర్షం


ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర సమగ్రశిక్ష ద్వారా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఆర్ట్స్, వర్కు, హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సంగీత, నృత్య విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లకు 23 శాతం వేతన పెంపుపై ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు హాజీమలంగ్, ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబులు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని మంగళవారం కడపలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బద్వేలి చిన వెంకటయ్య, కార్యదర్శి పరదేసి ఓబన్నలతోపాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు, హమాలీల దాహార్తి తీర్చడమే లక్ష్యం


చలివేంద్రం ప్రారంభిస్తున్న బంగారు నాగయ్య

కడప అగ్రికల్చర్: మార్కెట్‌యార్డుకు పసుపు, వేరుశనక్కాయలు తీసుకుని వచ్చే రైతులకు, మార్కెట్‌యార్డులో పనిచేసే హమాలీల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని కడప మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ భర్త, మార్కెట్ యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్య అన్నారు. మంగళవారం కడప మార్కెట్ యార్డులో సెక్రటరీ సుజాత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ఆమెతో కలిసి మార్కెట్‌యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్ సంపత్‌కుమార్, బీసీసెల్ ఉపాధ్యక్షుడు మధుసూదన్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్


స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌ను చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం ఇందిరానగర్‌లోని మండల పరిషత్తు ప్రైమరీ పాఠశాలలో స్వచ్ఛభారత్, ప్లాస్టిక్ నివారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మొహమ్మద్ ఖాజా మొయినుద్దీన్, మొహమ్మద్ సికిందర్ హుస్సేన్‌లు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమంతో పరిసరాలన్నీ పరిశుభ్రం అవుతాయన్నారు. అనంతరం ఇందిరానగర్‌లో విద్యార్థులతో స్వచ్ఛభారత్‌పై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది డాక్టర్ మస్తాన్‌వలి, షరీఫ్, ఖాజా, సికిందర్, స్కూల్ హెచ్ఎం మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్య బృందం

ఏఎఫ్‌యూ: డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్, సీఆర్‌ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కడప నగరం అలంఖాన్‌పల్లె పరిధిలోని ఎన్ఆర్ పల్లెలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె. రాకేష్‌చంద్ర ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. ప్రజలందరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని సూచించారు. డాక్టర్ పల్లా అభిలాష్ తీసుకునే ఆహారపదార్థాలను గురించి, అలవాట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌ఐ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సునీల్‌జయంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

వల్లూరు : మండలంలోని పైడికాలువలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవ, కుంభాభిషేక మహోత్సవాలను గురువారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు స్వామి హరి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీన ఉదయం గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 22వ తేదీన రాత్రి 7 గంటలకు కూచిపూడి నృత్య ప్రదర్శన, 9 గంటలకు పండరి భజన వుంటుందన్నారు. 23న రాత్రి 7 గంటలకు భరత నాట్య ప్రదర్శన, అనంతరం శ్రీ చౌడేశ్వరీ మాత కళా మండలి వారిచే శ్రీ చౌడేశ్వరీదేవి జననం పౌరాణిక నాటక ప్రదర్శన వుంటుందన్నారు.